పెదమల్లాపురంలో పర్యటించిన ముదునూరి

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని పెద్దమల్లాపురం గ్రామంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి పరిశీలికులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన హనికి లక్ష్మణరావు కుటుంబాన్ని పరామర్శించారు. ట్రస్టు తరపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుండు బెంచుబాబు, దొడ్డి సత్యనారాయణ, స్థానికులు నాగలక్ష్మి, పసగొడుగుల నాగేశ్వరరావు, తుంపాటి అజ్జమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

కౌలు రైతుకు అందని రుణాలు

- గతేడాది లక్ష్యం రూ.300 కోట్లు
- ఇచ్చింది కేవలం రూ.79.48 కోట్లు
- ఈ ఏడాది ఎంతమందికి ఇస్తారో..!
- ఎదురు చూస్తున్న కౌలుదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తమ కష్టాలు ఏనాడూ ప్రభుత్వానికి పట్టడం లేదంటూ కౌలు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు సౌకర్యాలు కోల్పోగా కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాతైనా తమ పరిస్థితుల్లో మార్పులు వస్తాయని ఆశించినా ఫలితం లేదు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు రూ.20 వేలు ప్రతి ఏటా ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల ముందు ఓట్ల కోసం కూటమి పెద్దలు హామీలు ఇచ్చారు.

అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులందరికీ పూర్తిస్థాయిలో సిసిఆర్ కార్డులు జారీ చేయకపోగా చేసిన వారికి సైతం పూర్తి స్థాయిలో రుణాలు అందించడం లేదు.

జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎక్కువమంది వెదజల్లు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది కూడా సుమారు 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగనుంది. 1.50 లక్షల మంది రైతులు ఉండగా వీరిలో లక్ష మందికి పైగా కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం వాస్తవ సాగుదారులను కౌలు రైతులుగా పరిగణించడం లేదు. గతేడాది 68,890 సిసిఆర్ కార్డులివ్వాలని లక్ష్యంగా తీసుకోగా 60,198 కార్డులు జారీ చేశారు. ప్రతి సంవత్సరం జూన్ నుంచి ఈ కార్డులను మంజూరు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రస్తుతం నత్తనడకన సాగుతోందనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఏడాది సిసిఆర్ కార్డులు 69 వేలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకోగా ఇప్పటివరకు సుమారు 15 వేల మందికి అందజేయగలిగారు. మిగిలిన వారికి ఎప్పటిలోగా పూర్తిస్థాయిలో కార్డులు ఇస్తారనేది వ్యవసాయ శాఖ అధికారులే రైతులకు సమాధానం చెప్పాల్సి ఉంది.

సాగుదారులకు అన్యాయమే

జిల్లాలో వేల మంది కౌలు రైతులు వాస్తవ సాగుదారులుగా ఉన్నా ప్రభుత్వం ఎందుకు వారిని నిర్లక్ష్యం చేస్తోందో అర్థం కావడం లేదు. సిసిఆర్ కార్డులు ఇవ్వడంలోనే అన్యాయం చేస్తున్న తీరు సరికాదు. కార్డులు ఇచ్చినా పూర్తిస్థాయిలో రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం శోచనీయం. నిబంధనల్లో సడలింపు ఇచ్చి సాగుదారులందరికీ రుణాలు మంజూరు చేయాలి.

-వి.రాజబాబు, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి.

పూర్తిస్థాయిలో మంజూరవని రుణాలు

ఖరీఫ్ సాగు మొదలైన వెంటనే రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో సాగు పనులు అనేక చోట్ల మొదలైపోయాయి. సిసిఆర్ కార్డుల జారీలో జాప్యం వల్ల రుణాల మంజూరు సైతం ఆలస్యమవుతుంది. గతేడాది రూ.300 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకోగా 20,495 మందికి కేవలం రూ.79.48 కోట్లు మాత్రమే ఇవ్వగలిగారు. అంటే లక్ష్యంలో 26 శాతం మాత్రమే ఇవ్వగలిగారు. రుణాల కోసం ఆశగా ఎదురుచూసిన పలువురు కౌలు రైతులకు నిరాశ తప్పలేదు. పూర్తిస్థాయిలో రుణాలు అందించాలని కోరుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వెంటాడుతోందనే ఆరోపణలు రైతుల్లో ఉన్నాయి. ఈ ఏడాది కూడా అల్లాంటి ఘనంగానే లక్ష్యాలు తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 461 మంది రైతులకు 1.96 కోట్లు మాత్రమే రుణం అందించారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.35 నుంచి 38 వేలు రుణాలు ఇవ్వాలని జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ప్రతి సంవత్సరం నిర్ణయిస్తున్నారు. ఇప్పటి వరకు 8 వేల మంది రైతులు పంట రుణాల కోసం బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పూర్తి పరిమితి మేరకు రుణాలు కల్పించాలని గత నెల 24న బ్యాంకులు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రుణాల లక్ష్య సాధన ప్రగతి సమీక్ష కమిటీ సమావేశాల్లో కలెక్టర్ కోరారు. కార్డులున్న అనేకమందికి బ్యాంకులు రుణాలు అందడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రతి ఐదుగురు కౌలు రైతులతో జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జెఎల్జి) ద్వారా రుణాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకుంది. గ్రూపులను కూడా అరకొరగానే ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

ఉపాధి కూలీలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లరేవు, ప్రత్తిపాడు

ఈ నెల 9న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం తాళ్లరేవులో సంఘం ముద్రించిన కరపత్రాలను ఉపాధి కార్మికులకు అందజేశారు. సమ్మెలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కార్మికులు పాల్గొని ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి కార్మికుల మెడపై కత్తి పెట్టారని అన్నారు. పని గంటలను పెంచి కార్మికులను దోపిడీ చేసి పెట్టుబడిదారులకు పరిశ్రమల అధిపతులకు లాభం చేకూర్చేలా జిఒలు చేస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో కేటాయింపులు తగ్గిస్తూ ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు వేయకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నేరేడుమిల్లి త్రిమూర్తులు, బీర వెంకటేశ్వర్లు, ఎం.అనసూయ, మరణాల సత్యవతి, దడాల మీరాబి, కెవిపిఎస్ నాయకులు విప్పర్తి శ్రీనివాసరావు, తనుకు రాంబాబు, దడాల బుజ్జిబాబు, కొప్పల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని ప్రత్తిపాడులో మిడ్డేమీల్స్ కార్మికులు ఎంఇఒ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మిడ్డేమీల్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు పి.వరలక్ష్మి మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలని, పిల్లలు బిల్లులు రూ.20కి పెంచాలని డిమాండ్ చేశారు. జులై 9న జరిగే సమ్మెలో మిడ్డే మీల్స్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఇ.అనంతలక్ష్మి, ఎం.మంగాలక్ష్మి, ఎం.మహాలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమ్మెను నోటీసును అందిస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

గవర్నర్ పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లును ఎస్‌పి జి.బిందుమాదవ్ పరిశీలించారు. గురువారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్‌ను, జెఎన్‌టియుకెలో అతిథి గృహం, సభా ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. భద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు, అతిథులు ఎలాంటి అసౌకర్యం ఎదుర్కోకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రసాద్, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ మోహనరావు, అదనపు ఎస్‌పి(ఎఆర్) ఎస్.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు పాటిల్ మనీష్‌దేవరాజ్, శ్రీహరి రాజు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి బిందు మాధవ్

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఇఒలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తనిఖీలు చేశారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, అయోధ్య రామపురం పాఠశాల, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను వారు వేర్వేరుగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మిడ్డే మీల్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, పీడీ సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

బాలికల రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలలు, శిశువులకు ఎన్ని రక్షణ చట్టాలు ఉన్నా సమాజంలో మార్పు రావాలన్నారు. శిశువులు చెత్త కుప్పలు పాలు కాకుండా 'మిషన్ వాత్సల్య' పేరుతో ప్రతి ఆసుపత్రి లోనూ ఒక ఉయ్యాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా బిడ్డను అక్కర్లేదనుకుంటే రహస్యంగా ఆ ఉయ్యాలలో వేయాలని అన్నారు. వారి సంరక్షణను ఐసిడిఎస్ తీసుకుంటుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోకి మార్పు చేసిన ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి నూతన కంప్యూటర్లను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, వైస్ ఎంపిపి చిక్కాల రాజేశ్వరి, సిడిపిఒ టిడి.ఆర్.పద్మావతి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

ఆగస్టు 1 నుంచి మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

ఆగస్టు 1 నుంచి 12వ తేదీ వరకు కాకినాడలో జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్షిప్ పోటీల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి రెవెన్యూ, క్రీడాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, మున్సిపల్ కార్పొరేషన్, సమాచార పౌర సంబంధాలు, ఆర్ అండ్ బి, ఎపిఇపిడిసిఎల్, హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 12వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న ఈ పోటీలు కాకినాడ క్రీడా మైదానం ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో జరగనున్నాయన్నారు. ఈ ఛాంపియన్షిప్ పోటీల్లో దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి సుమారుగా 500 మంది క్రీడాకారులు, 200 మంది సహాయక సిబ్బంది హాజరువుతారని తెలిపారు. ఈ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సక్రమమైన వసతి, భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగు నీరు వసతులను మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య శిబిరంతో పాటు ఒక మెడికల్ అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా క్రీడ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, డిఎం అండ్ హెచ్ఒ జె.నరసింహనాయక్, సిపిఒ పి.త్రినాథ్, హాకీ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ జి.హర్షవర్ధన్, జాయింట్ సెక్రెటరీ బి.రవిరాజు, సెట్రాజ్ సిఇఒ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

58వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తమ సమస్యల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 58వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నా తమకు వేతనాలు పెంచకపోవడం అన్యాయం అన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాసిన భద్రరావు, ఆకుల రామకష్ణ, వాకాడ భాస్కర్, అయ్యప్ప స్వామి, కే వెంకటరమణ, మల్లిపెద్ది వీరభద్రరావు, ఓ సోనియా, సుంకర సత్తిరాజు, పచ్చిపాల శ్రీను పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


చెక్కును అందజేస్తున్న పిల్లి దంపతులు

సిఎం సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను లబ్ధిదారులకు మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారిలో 20 మంది లబ్ధిదారులకు సుమారు రూ.18 లక్షల విలువైన చెక్కులను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కష్టాన్ని అర్థం చేసుకుంటూ ఆరోగ్య పరంగా ఎలాంటి భయం లేకుండా జీవించేందుకు ప్రభుత్వం నిస్వార్థంగా కృషి చేస్తోందని అన్నారు.

తప్పుడు రికార్డులతో 'తల్లికి వందనం' దూరం

ప్రజాశక్తి - కాకినాడ

తన పేరిట భూములు లేకున్నా యండమూరు గ్రామంలో సుమారు 11.303 సెంట్లు భూమి ఉందని రెవెన్యూ అధికారులు రికార్డులు సృష్టించారని, దీంతో తనకు తల్లికి వందనం రాకుండా పోయిందని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన రాయుడు శివప్రసాద్ భార్య గిరిజ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ యండమూరి గ్రామంలో సర్వేనెంబర్ 509/2లో 1.4850, 505/1లో 9.810తో కలిపి మొత్తం 11 ఎకరాలకు పైగా భూమి రెవెన్యూ రికార్డుల్లో తన పేరిట నమోదయిందని అన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం తన బిడ్డలకు వర్తించ కుండా పోయిందని వివరించారు. ఇప్పటికే గ్రామ విఆర్ఒ, కరప మండల తహశీల్దార్‌ను కలిసినట్లు తెలిపారు. అలాగే కలెక్టరేట్‌లో జరిగుతున్న పిజిఆర్ఎస్‌లోనూ రెండు దఫాలు ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు. అయినా తన సమస్యను పరిష్కరించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు చేసిన తప్పిదాన్ని సరి చేయాలని, లేనిపక్షంలో తన పేరిట ఉన్న 11 ఎకరాల భూమినైనా తనకు అప్పగించాలని ఆమె కోరారు.

నేడు జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి జెఎన్‌టియులోని అలుమ్ని ఆడిటోరియంలో జరగనున్నట్లు వైస్ ఛాన్సలర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. గురువారం తన తన ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ పాల్గొననున్నారని తెలిపారు. స్నాతకోత్సవంలో 2023- 2024 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తామన్నారు. బిటెక్ 41258, బి.ఫార్మసీ 2081, ఎం.ఫార్మసీ 1659, ఎంబిఎ 3797, ఎంసిఎ 1115, ఎం ఫార్మసీ 458, బిబిఎ 115, ఫార్మా డి 274, బిఆర్‌కె 83, పిహెచ్‌డి 99 లతోపాటు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు 40 మందికి ప్రదానం చేస్తామన్నారు. అలాగే అమెరికాలో బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఒఎస్‌డి డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, జి.పద్మజారాణి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విసి ప్రసాద్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు చేపట్టే పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, ఒంటితాడి, పల్లిపాలెం, శీల గొర్రిపూడి, కొంగోడు, బంధనపూడి, చీకట్ల వారిపేట, మతుకుమిల్లి, తర్లంపూడి, టి.మామిడాడ, చేదువాడ గ్రామాలకు, పరిశ్రమలు, ఆక్వా ఏరియాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు.

కార్టూ'నిజం'

ప్రభుత్వం చెప్పేదానికి కాగ్ నివేదికలు పూర్తి విరుద్ధం
జగన్

41 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

నియోజకవర్గ పరిధిలో కొత్తగా 41 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని ఆర్‌డిఒ కె.శ్రీరమణి తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని 41 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అలాగే ప్రస్తుతం నిర్వహిస్తున్న పోలింగ్ స్టేషన్లలో రెండు పోలింగ్ స్టేషన్ల పేర్లు, ఏడు పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రదేశాలలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రతిపాదనలు పరిశీలించిన అనంతరం జిల్లా ఎన్నికల అధికారికి పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై ప్రతిపాదనలు సమర్పిస్తామన్నారు. కొంతమంది ఓటర్లను సమీప పోలింగ్ స్టేషన్‌కు మార్పు చేసే ప్రతిపాదనలు కూడా వచ్చాయన్నారు. కొత్తగా విస్తరిస్తున్న కాలనీలు పెరుగుతున్న జనాభా దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాలలో కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి సిఫార్సులు చేయబడ్డాయన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, టిపిఒ ఫణికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జిల్లా నాయకులు నీలపాల సూరిబాబు, డి.క్రాంతికుమార్, కేదారి నాగు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్‌ను పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - జగ్గంపేట

అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర సిహెచ్‌సి రైతు గ్రూపునకు మంజూరైన డ్రోన్‌ను స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో రైతులకు డ్రోన్లు అందిస్తుందన్నారు. రైతులు ఐదుగురు గ్రూప్‌గా ఏర్పడి డ్రోన్ యంత్రాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి వైస్ ఎంపిపి కుంచె రాజా, టిడిపి నాయకులు పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, బొల్లంరెడ్డి రామకృష్ణ, ఎడిఎ జి.శ్రీనివాస్, గండేపల్లి మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్, ఐఒబి బ్యాంక్ మేనేజర్, సూరంపాలెం విహెచ్ఎ సాయికిరణ్, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుదలకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాల పెంపుదలకు చర్యలు తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోరింది. గురువారం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, యూనియన్ అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాసరావు ఎంఎల్ఎ వనమాడి కొండబాబుకు, రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ పిఎకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని, కాకినాడ స్పెషల్ సానిటేషన్ పాశుధ్య కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న ఆరు డిఎలు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బంగారు రాజేష్, శ్రీనివాస్, కటారి సత్యనారాయణ, లక్ష్మణ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర సంచుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక నాగమల్లి తోట వద్ద శ్రీసత్య దంత వైద్యశాలలో ఐడిఎ సభ్యులచే విద్యార్థులకు చేనేత వస్త్ర సంచులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వాడకం సమాజానికి హానికరమని అన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా వస్త్ర సంచులు ఎంచుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్ డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ లిఖిత, డాక్టర్ మాధురిభవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో 15 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - అయినవిల్లి

సిరిపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను మోసం చేసిన కేసులో నిందితుడికి కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి 15 ఏళ్ల జైలు, రూ.11,000 జరిమానా విధించినట్లు సిఐ ఆర్. భీమరాజు తెలిపారు. వివరాలు ఇవి.. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన వసపర్ల సురేష్‌బాబు అమలాపురం ఎస్‌ఎస్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న మైనర్ బాలికను మాయ మాటలతో మోసగించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బాలికపై నాలుగు సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు ఆమె కుటుంబ సభ్యులు అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో 2018 జూలై 8న ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ షేక్ జానీ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఏడేళ్లుగా కేసు విచారణ సాగగా గురువారం కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి నిందితుడికి 15 సంవత్సరాలు జైలు శిక్ష రూ.11వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తల్లీ కుమార్తె అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

మండలం నెలటూరుకు చెందిన జాలా రజిత, రెండేళ్ల వయస్సు ఉన్న కుమార్తె గత నెల 26వ తేదీ నుండి కనబడుటలేదు వారి ఆచూకీ కోసం ఆమె భర్త అయినా ప్రసాద్ మరియు ఆమె బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించినట్లు సదర విషయమై గురువారం చాగల్లు పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త ప్రసాద్ ఫిర్యాదు చేయగా చాగల్లు హెచ్‌కె చింతా రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉచిత ప్రవేశాలు పూర్తి చేయకపోతే చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ప్రయివేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలను ఈ నెల 9వ తేదీ నాటికి పూర్తి చేయకపోతే ఆయా పాఠశాలలపై చర్యలు తప్పవని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యాహక్కు చట్టం- 2009, సెక్షన్ 12(1)సి క్రింద ప్రయివేట్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల కుటుంబాల పిల్లలకు 25 శాతం సీట్లు ఉచిత ప్రవేశాలు కల్పించే అంశంపై చర్చించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన మూడు వారాలుగా జిల్లాలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు విద్యాహక్కు చట్టం కింద ఉచిత ప్రవేశాలు కల్పించిన తమ పిల్లలకు ప్రయివేట్ పాఠశాలలు ఏదో ఒక కారణం చెప్పి ఉచిత ప్రవేశాలు నిరాకరిస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. అర్హత కలిగి, లాటరీలో కేటాయించిన ప్రతి పేద విద్యార్థికి ప్రయివేట్ పాఠశాలలు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన జిల్లావ్యాప్తంగా పేరెంట్, టీచర్ సమావేశాలు జరుగుతాయని, పేద విద్యార్థులు తల్లికి వందనం పథకం ప్రయోజనాలు కోల్పోకుండా ప్రయివేట్ పాఠశాలలన్నీ ఈలోపున 9వ తేదీ నాటికి అర్హత కగిలిన వారందరికీ ఉచిత ప్రవేశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. లాటరీలో కేటాయించిన ఏ విద్యార్థికి ఉచిత ప్రవేశం నిరాకరించినా, అందుకు స్పష్టమైన కారణాలతో సంబంధిత మండల విద్యాధికారికి ప్రయివేట్ యాజమాన్యాలు వివరణ సమర్పించాలని తెలిపారు. పాఠశాలలు తెలిపిన అభ్యంతరాలు, కారణాలను పునఃపరిశీలించి, తిరస్కరించిన విద్యార్థులలో అర్హులైన ఎంఇఒలు మరల ఆయా పాఠశాలలకు కేటాయిస్తారని, అటువంటి విద్యార్థులకు పాఠశాలలు తప్పని సరిగా 25 శాతం ఉచిత ప్రవేశ క్రింద చేర్చుకోవలసిందేనని అన్నారు. ఆ ఆదేశాలను పాటించని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఇఒ పి.రమేష్, సమగ్రశిక్షాభియాన్ ఎపిసి వేణుగోపాల్, యంఇఒలు, ప్రయివేట్ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పలు పరిశ్రమల యాజమాన్యాలకు సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చిన్నా చితకా పరిశ్రమలకు ఎటువంటి రాయితీలు ఇవ్వకుండా బడా కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో పలు పరిశ్రమలు మూతపడ్డాయన్నారు రీజెన్సీ పరిశ్రమ తెరవడానికి యాజమాన్యం ముందుకు వచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వం సహకరించకపోవడం దారుణమన్నారు. ఈ సమ్మెకు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు, పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు, ఆటో కార్మికులు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి శ్రీనివాసరావు, దాసరి రాజు, కె.మధుబాబు, కె.రమణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యానాం

విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు అన్నారు. గురువారం స్థానిక సర్వ శిక్ష అభియాన్ కాన్ఫరెన్స్ హాల్లో రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మొబైల్ వాడుతున్న విద్యార్థులు ఎక్కువగా వాడరాదని అన్నారు. మాదకద్రవ్యాల అనర్థాలు, వ్యక్తిగత భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఒలేటి సుందరి, ఎఎస్ఐ ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ కళావతి పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

రైల్వే స్టేషన్‌ను ఎస్‌పి జి.బిందు మాదవ్ సందర్శించి తనిఖీలు చేపట్టారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోట రైల్వే స్టేషన్‌కు రానున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో కాకినాడలో జరిగే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఎస్‌పి స్థానిక రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌పిఎఫ్, సిఆర్‌పి ఎస్‌ఐలు, సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, స్టేషన్ ఆవరణ, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐలు కృష్ణ భగవాన్, విజయ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన అధికారులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి, తాటిపర్తి, దివిలి, వడ్లమూరు, పులిమేరు, గోరింట గ్రామాల్లో మండల స్థాయి అధికారులు పర్యటించారు. ఆయా గ్రామాలలో నెలల తరబడి పేరుకుపోయిన చెత్త కుప్పలను గుర్తించారు. ఆరు గ్రామాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపులను గుర్తించారు. లింకు రోడ్లను పరిశీలించి వాటి స్థితిగతులు తెలుసుకున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు వలి, కళావతి, ప్రతాప్, దత్తు, సాయితేజ, సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కాకినాడలోని 9, 20వ డివిజన్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ముద్రించిన కరపత్రాలను ప్రజలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో భయానకమైన వాతావరణం ఉండేదని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంతత నెలకొందన్నారు. విధ్వంసం పాలైన రాష్ట్రాన్ని చంద్రబాబు నాయకత్వంలో గాడిన పెట్టి వికాసం దిశగా పయనింప చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వాసంశెట్టి చిట్టప్ప, చాపల ప్రశాంతి, నులుకుర్తి మోహన్, గొరుసు వెంకట దుర్గారావు, ఆకుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని తాళ్లూరు గ్రామంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, సర్పంచ్ శీలమతుల వీరబాబు, నాయకులు కొండ్రు అప్పలరాజు, పాలచర్ల సత్యనారాయణ, బొల్లం రెడ్డి రామకృష్ణ, కంటిపూడి సత్యనారాయణ, ఉండవల్లి బులి వీర్రాజు, దాసరి ధన, వాసు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని పి.వేమవరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, టిడిపి నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, ఆకునూరి సత్తిబాబు, తోటకూర శ్రీనివాస్, పెంకె వెంకటేష్, చీకట్ల వెంకటేష్, నూనె రామారావు, తదితరులు పాల్గొన్నారు. **పత్తిపాడు** మండలంలోని ఏలూరు గ్రామంలో సుపరి పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభతోపాటు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి సానా సతీష్ మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్, అమ్మకు వందనం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తదితర పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలికులు మెట్ల రమణబాబు, నాయకులు కొమ్ముల కన్నబాబు, ఇళ్ల అప్పారావు, అమరాది వెంకట్రావు, యాళ్ల జగదీష్, రొంగల సత్తిబాబు, చక్కపల్లి నవీన్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని నీలపల్లిలో సుపరిపాలనలో తొలి అడు గు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పాల్గొని మాట్లాడారు. అలాగే పెద బొడ్డు వెంకటా యపాలెం, .జి. వేమవరంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద ఆధ్వర్యంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడులో పాల్గొన్న ఎంపి సానా సతీష్, ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

ఘనంగా ఎస్‌విఆర్ జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ విశ్వ నట చక్రవర్తి సామర్ల వెంకట రంగారావు(ఎస్‌విఆర్) 107వ జయంతి వేడుకలు స్థానిక ఐదు బిల్డింగుల వద్ద కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌విఆర్ విగ్రహానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు పూలమాలవేసి నివాళులర్పించారు. నటనా రంగంలో ఎనలేని ప్రశంసలు అందుకున్న ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని కోరాతానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, సంఘ గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకర్‌రావు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సద్భావన సంఘం ప్రతినిధులు రంగనాయకులు, మాధవరపు పట్టాభిరామయ్య, సలాది మూర్తి, పి.సేతుమాధవరావు, అడపా ప్రకాష్‌నాయుడు, మాధవరపు తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని కోరంగి పంచాయతీ బొడ్డు పెదవెంకటాయపాలెంలో ఎస్‌విఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, సుంకరపాలెం సర్పంచ్ టిళ్ళపూడి నాగేశ్వరరావు, కొప్పిశెట్టి బాబి, కొప్పిశెట్టి చంటి, వెంటపల్లి ఉమా మహేశ్వరి, పోతురాజు ఆనంద్‌రావు, ఈశ్వరరావు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** నటమాంత్రికుడు ఎస్‌వి.రంగారావు జయంతిని రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, రాజా, ఉంగరాల వెంకటేశ్వరరావు, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పెద్దాపురం

ప్రత్యేక పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం దుర్గాడ గ్రామంలో జడ్‌పి సిఇఒ లక్ష్మణరావు పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ కొరకు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకును పరిశీలించి 15 రోజులకు ఒకసారి ట్యాంక్ క్లీనింగ్ జరిగేలా చూడాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. వాటర్ పైపులు లీకులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.స్వప్న, ఇఒపిఆర్‌డి విజయ్ సాగర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం జి.రాగంపేట, చదలాడ, దివిలి గ్రామాల్లో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ పర్యటించారు. తడి, పొడి చెత్త సేకరణ, వాహనాలలో చెత్తను తరలించే విధానం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజారోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఏరోజు చెత్తను ఆ రోజే తొలగించాలన్నారు. ఈ పర్యటనలో పంచాయతీల కార్యదర్శులు ఈశ్వరరావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయంలో దుర్గాష్టమి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, లక్ష కుంకుమ పూజ, విశేష పూజలను ఆలయ వేద పండితులు, అర్చకులు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ దంపతులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వాడక నిషేధ దినోత్సవాన్ని పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోగలుతామని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్స్లర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ అధికారి తోటకూర గంగాధర్ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో.ఎంబి.శ్రీనివాస్, ప్రో. వైస్ ఛాన్సలర్స్ డా.ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ఆదిత్య విద్యాసంస్థల కన్స్ట్రక్షన్ డైరెక్టర్ మేడపాటి భాస్కరచంద్రారెడ్డి, గ్రంథాలయ విభాగాధిపతి కె.అశోక్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పున్నం నాగేశ్వరావులు గంగాధర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు శిక్షణ ఒక సాధనంగా దోహదపడుతుందని లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు శ్రీదేవిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక అడబాల ట్రస్ట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గృహాలకు పరిమితమైన మహిళలకు ఇప్పటివరకు 17 బ్యాచులకు కుట్టు శిక్షణలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్‌ఎల్.ప్రసూన, క్లబ్బు కార్యదర్శి శ్రీవాణి, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించడం జరిగిందని ఎంపిడి రాంబాబు తెలిపారు. గురువారం మండలంలోని ఆర్యవటం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మూసివేస్తున్నారనే ఊహాగానాలతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందడంతో ఆయన ఆ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను మూసివేయడం జరగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు వనం వెంకటసుబ్బారావు, ఎంఇఒ డేవిడ్, పాఠశాల హెచ్‌ఎం అమ్మాజీ, స్థానిక నాయకులు కోట తాతబ్బాయి, చందాల బాబి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు జిప్‌మెర్‌లో స్పెషలిస్ట్ వైద్యులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యానాం

యానాం జిప్మెర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ విభాగాల స్పెషలిస్ట్ వైద్యులను కన్సాలిడేటెట్ ప్రాతిపదికన నియామకం కోసం శుక్రవారం వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్‌రాజ్ మాట్లాడుతూ అనస్తీషియా-2, కార్డియాలజీ-1, జనరల్ మెడిసిన్-1, జనరల్ సర్జరీ-1, ఒబిజి-1, రేడియో రోగ నిర్ధారణ-1, నెఫ్రాలజీ-1 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సంబంధిత స్పెషాలిటీలో డిగ్రీ, మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. నెలకు రూ.1.24 లక్షల కన్సాలిడేటెడ్ పే ఉంటుందన్నారు. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 10 పోస్టులకు జనరల్-2, ఒబిసి-4, ఎస్‌టి-2 ఖాళీలు ఉన్నాయని, ఎంబిబిఎస్‌తోపాటు, మూడేళ్ల అనుభవం ఉండాలని ఎంపికైనవారికి నెలకు రూ.1.03 లక్షల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు శుక్రవారం ఉదయం 9 గంటలకు జిప్మెర్ ఆసుపత్రిలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

గోనేడ రోడ్డుకు తాత్కాలిక మోక్షం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం నుంచి గోనేడ వెళ్ళే రోడ్డుకు గుంతలు పడి నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. సమస్యను గుర్తించిన టిడిపి తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు నీరు పోయే మార్గాన్ని ఏర్పరిచి కంకర చిప్స్ వేయించారు. దీంతో ఈ రోడ్డుకు తాత్కాలిక పరిష్కార మోక్షం కలిగింది.

ప్రయివేటు పాఠశాలల బంద్

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని ప్రయివేటు పాఠశాలల గురువారం బంద్ పాటించారు. యునైటెడ్ ప్రయివేట్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండలంలోని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలను మూసి బంద్ పాటించారు.

మరిడమ్మను దర్శించుకున్న వైభవ్ ఎండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారిని గురువారం కాకినాడ వైభవ్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ప్రాజెక్ట్ ఎండి వివి.రమణమూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాధులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పిఠాపురం గోపాల బాబా ఆశ్రమం ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహార, దద్దోజనం పంపిణీ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఆంజనేయులు

వైఎఫ్ఎస్ఐ ఓరియంటేషన్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ) ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని సామాజిక సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారానికి తమ భాగస్వామ్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైఎఫ్ఎస్ఐ సమన్వయకర్తలు వి.రాంబాబు, డిఎస్.మధుప్రసాద్, కామర్స్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కె.లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట, గొల్లప్రోలు

33/11 కెవి జెహెచ్‌సి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, ట్రీ ట్రిమ్మింగ్ మరియు కన్డక్టర్ మార్పు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎపిఇపిడిసి ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి బలుసులపేట ఫీడర్ పరిధిలోని భాస్కర్ కాలనీ, సాయినగర్, సదాశివ నగర్, మెహర్ నగర్, ఎంప్లాయిస్ కాలనీ, మాజేటి నగర్, అమ్మణమ్మ అపార్ట్‌మెంట్, జగ్గమ్మగారి పేట, పెద్దాపురం రోడ్ ప్రాంతాలతో పాటు, 11 కెవి ఐటిసి ఫీడర్ పరిధిలోని జగనన్న కాలనీ, సత్యనారాయణపురం వ్యవసాయ ఫీడర్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు అంతరాయం ఏర్పడనుందన్నారు. గొల్లప్రోలు మండలంలో 24 గంటలు విద్యుత్ సరఫరా నిమిత్తం వేసే లైన్, మరమ్మతుల కారణంగా శుక్రవారం చేబ్రోలు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు, దుర్గాడ, ఎ.మల్లవరం, ఎవి.నగరం, తాటిపర్తి, చినజగ్గంపేట, చెందుర్తి, వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

నేడు అల్లూరి జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం

చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు డ్రాయింగ్ పోటీలు, నాలుగు గంటలకు క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. అనంతరం ఐదు గంటలకు పిసిసి గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే సభలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకర్ వర్మ పాల్గొని మాట్లాడతారని తెలిపారు. ఈ సభలో విజేతలు అందరికీ బహుమతులు అందజేస్తామన్నారు.

విక్రయాల పెంపుదలకు చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మహిళా మార్టులలో విక్రయాల పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు సెర్ఫ్ అసిస్టెంట్ డైరక్టర్ మహిత అన్నారు. గురువారం మండలంలోని కోరంగిలో మహిళ మార్ట్‌ను ఆమె సందర్శించారు. రోజువారి అమ్మకాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో తాళ్లరేవు, యు. కొత్తపల్లి, కిర్లంపూడి, తొండంగిలలో ఉన్న మహిళా మార్ట్‌ల పనితీరు, ప్రగతి పరిశీలించడానికి పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ మార్ట్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్‌రెడ్డి, డిపిఎంలు వెంకటేశ్వరరావు, విబిఆర్.రాయ్, ఎపిఎం బి. విష్ణుమూర్తి, ఎల్‌సి తాడి మురళీకృష్ణ, మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంపిఎల సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - సామర్లకోట

'ఇండియన్ క్రిస్టియన్ డే' సందర్భంగా మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్. డాక్టర్ టి.బ్లెస్సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోసెస్ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం స్టేషన్ సెంటర్లోని రిక్షా కార్మికులకు దుప్పట్లు, ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు.

CHANGE OF NAME

I, **MOHAMMED FAYAZ (New Name), S/o. MOHAMMAD FAZALULLA SHAH,** Resident of D.No.4-7-6, Mazeed Khan Street, Ram Nagar, Pati Meeda, Nidadavole, Nidadavole Mandal, E.G.Dt., I have changed my name from **MOHMMED FAYAJ, (Old Name), S/o. FAJULLASHA MOHMMED,** To **MOHAMMED FAYAZ (New Name), S/o. MOHAMMAD FAZALULLA SHAH** for all practical purposes.

PASSPORT LOST

Iam having **Original Passport** bearing **No. H 3595078** issued by the Passport Office at Visakhapatnam **on 20-04-2009.** It is valid till on 19-04-2019 on **01-07-2025 at 10.30 AM** while I was proceeding towards Devichowk Centre, Rajamahendravaram from my house D.No. 17-1-21/A, Seethampeta, Rajahmundry by my motor cycle by putting my Original Passport on the back side of the pant pocket, when I reached Devi chowk, Rajahmundry I found missing my Passport. Inspite of my best efforts I could not traced my Original Passport. If anybody found please intimate the same immediately.

BUKKA BHANU RAMA SATHISH
Cell: 9542127447

మహారాజశ్రీ 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టు, కాకినాడ
O.S. No. 40/2024

Between:
దాట్ల సత్యనారాయణరాజు -వాది
మరియు
తటవర్తి సుబ్బలక్ష్మి & Others -ప్రతివాదులు

To:
4వ ప్రతివాది: నాగం మంజు భార్గవి, W/o. సుదర్శన గోపాల్, డో.నెం. 4-4-18, కొల్లువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ.
5వ ప్రతివాది: పాట్నీడి సూర్యకుమారి, W/o. రఘువీర్, డో.నెం. 4-4-18, కొల్లువారి వీధి, రామకృష్ణారావుపేట, కాకినాడ.

పై దావాలో 4, 5 ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తము ది. 23-7-2025వ తేదీన వాయిదా అయివున్నది. కావున 4, 5 ప్రతివాదులైన మీరు పై కోర్టు ఎదుట **ది. 23-7-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను.

(By Court Order)

నృసింహదేవర విశ్వనాథం
ఎ.అప్పారావు
డి.ఎస్.సుధాకర్
కాకినాడ టి.దుర్గబాబు, అడ్వకేట్స్
ది.04-7-2025 కాకినాడ
సెల్: 9505411444

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A. 1953/2022 in
ASSR No. 1364/2024

Between:
Association for Promoting Spiritual & Socio Economic Activities ...*Petitioner*
AND
Penumatsa Durga Prasad Raju, S/o. Satyanarayana Raju, Hindu, aged 63 years, Business, D.No. 26-1-12, Tanuku, W.G.Dist. ...*Respondent*

పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 11-7-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి జి.వి.రామలక్ష్మి
02-7-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

CHANGE OF NAME

My Spouse/ Wife's previous name is **BUKKA REVATHI.** We obtained divorce **on 17-08-2017** in F.C.O.P. No. 26 of 2017 from the Hon'ble Family Court - cum - IX Addl. District Court, Rajamahendravaram. I Married **Sujatha Peetani on 15-12-2018 at night 03-53 hrs.,** since then she is being called as Bukka Sujatha and she is my legally wedded wife.

BUKKA BHANU RAMA SATHISH
Cell: 9542127447

డిగ్రీ సర్టిఫికేట్ పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, తొత్తరమూడి గ్రామానికి చెందిన కడలి వివేక్, తండ్రి: సత్యమూర్తి, డిగ్రీ బికాం సర్టిఫికేట్ పోయినది. నేను ది.25-06-2025 న అయినవిల్లి నుండి అమలాపురం బస్సులో వెళుతుండగా డిగ్రీ బికాం ఒరిజినల్ సర్టిఫికెట్లు కవరుతో మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికిన దొరకలేదు. నా ఆల్ టికెట్ నెం. 116128103055 ఎవరికైనా దొరికిన యెడలా కింది అడ్రస్‌కు తెచ్చి ఇవ్వగలరు.

కడలి వివేక్, తండ్రి: సత్యమూర్తి
డో.నెం.6-32, తొత్తరమూడి గ్రామం
అయినవిల్లి మండలం, పిన్: 533211
సెల్: 7780499220

దస్తావేజులు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, చక్రద్వారబంధం గ్రామానికి చెందిన సోడసాని పోలారత్నం W/O. రామ దుర్గారావు, వీరి కుమారుడు సోడసాని జానకి రామారావు, డోర్ నెంబర్: 2-64 కు చెందిన సదరు జిల్లా కోరుకొండ మండలం కణుపూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 293లో 5.45 1/2 ఎకరాలు పొలానికి సంబంధించిన దస్తావేజు నెంబరు: 1941/2004 ఒరిజినల్ దస్తావేజులు మా ఇంటి నుంచి రాజానగరం వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియపరచగలరు.

సోడసాని జానకి రామారావు
చక్రద్వారబంధం, రాజానగరం మండలం
సెల్: 9948026769

పోయినవి

మా క్లయింటు తూ॥గో॥జిల్లా, బిక్కవోలు మండలం, తొస్సిపూడి గ్రామ కాపురస్తులు **తేతలి వెంకటరెడ్డి గారి కుమార్డు జగ్గిరెడ్డి గారు** మాకిచ్చిన సంజాయిషీపై ఇందుమూలముగా తెలియజేయునది.

మా క్లయింటు తాలూకు తొస్సిపూడి గ్రామంలో గల **శ్రీ వెంకటేశ్వరా పౌల్ట్రీస్** నిర్మాణమునకు సంబంధించి 1970వ సం॥లో గ్రామపంచాయతీ తొస్సిపూడి వారు ఇచ్చిన పర్మిషను మరియు సదరు పౌల్ట్రీ నెలకొల్పుటకు ఎట్టి అభ్యంతరము లేదని గ్రామ ప్రజలు ఇచ్చిన వినతి పత్రములు ఈ రెండునూ ది. **29-6-2025వ తేదీన** నేను తొస్సిపూడి నుండి రామచంద్రపురం లామినేషన్ నిమిత్తం వెళ్ళుచుండగా రామచంద్రపురంలో పడిపోయినవి. ఎంత వెతికినను దొరకలేదు. కాబట్టి ఎవరికైన లభించిన ఎడల మా క్లయింటునకు గాని, ఈక్రింది నా అడ్రసుకు గాని అందజేయవలెను. తగిన పారితోషికము ఇవ్వబడును.

ఎస్.వి.వి.సత్యనారాయణరెడ్డి
అడ్వకేట్ & నోటరీ
అనపర్తి, సెల్: 9849621028

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), తాడేపల్లిగూడెం వారి కోర్టులో
E.P.No. 2/2024 in O.S.No. 173/2015

మధ్య:
గుల్లిపల్లి ఉదయ భాస్కర్ ...పిటీషనరు/డి.హెచ్.ఆర్.
Vs
కాకర్ల గంగరాజు ...రెస్పాండెంట్/జె.డి.ఆర్.

J.D.R : కాకర్ల గంగరాజు, S/o. సత్యనారాయణ, వయస్సు 55 సం॥లు, వ్యవసాయం, అచ్చెన్నపాలెం గ్రామం, నల్లజర్ల మండలం, తూర్పు గోదావరి జిల్లా - 534111.

D.H.R. తరపు జారీ చేసిన పత్రికా ప్రకటన
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం U/O 5 రూల్ 20 C.P.C. ప్రకారం

పై నెంబరు E.P. లో డి.హెచ్.ఆర్./పిటీషనరు పలుమార్లు జె.డి.ఆర్./రెస్పాండెంట్‌కు నోటీసులు పంపినా ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందున శ్రీ కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా అమలు నిమిత్తం ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట **ది. 15-07-2025వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి సమాధానం తెల్పవలెను. లేని యెడల మీ పై పరోక్షముగా తీర్మానం చేయుదురు అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

శిరిగినీడి విజయకృష్ణ
అడ్వకేట్ అండ్ నోటరీ, మాజీ ఏపీపీ
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం
తేదీ. 02-07-2025 సెల్: 94401 11251